క్లుప్తంగా

బహిరంగ వేలం

సిద్దిపేటరూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని బుగ్గరాజేశ్వరస్వామి ఆలయం వద్ద దుకాణ సముదాయాలకు సంబంధించిన బహిరంగ వేలాన్ని 10వ తేదీన ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బాగన్న కర్ణాకర్ శనివారం తెలిపారు. కొబ్బరి కాయలు, నూనె గురుగులు, లడ్డు, పులిహోర విక్రయాలు, పార్కింగ్ నిర్వహణకు వేలం వేయనున్నట్లు తెలిపారు. టెండర్ దారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): తమ గ్రామానికి సాగునీరు విడుదల చేయడంలో సహకరించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫ్లెక్సీకి మండల పరిధిలోని రామునిపట్ల గ్రామస్తులు, రైతులు శనివారం క్షీరాభిషేకం చేశారు. రంగనాయక సాగర్ జలాశయం నుంచి కాలువ ద్వారా ఇరిగేషన్ అధికారులు గ్రామానికి సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులు సంబురాలు నిర్వహించారు.

కూలీల ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న కూలీలు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఉపాధి హామీ కూలీలు ఆర్థిక సాయంచేసి ఆదర్శంగా నిలిచారు. మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో పనిచేస్తుండగా తల్లీకూతురు మృతి చెందగా ఐదుగురికి గాయాలైన ఘటన తెలిసిందే. ఈ క్రమంలో గౌరవెల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు రూ.5వేల పోగుచేసి బాధిత కుటుంబాలకు అందజేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామికి శనివారం అందజేశారు. ఈ సొమ్మును బాధిత కుటుంబాలకు ఆదివారం అందజేస్తానని చెప్పారు.

ముగిసిన శిక్షణ


శిక్షణలో పాల్గొన్న అంగన్వాడీలు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట రైతు వేదికలో చిన్నారుల అభివృద్ధిపై రెండు రోజుల పాటు అంగన్వాడీ ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, బ్లాక్ కో ఆర్డినేటర్ నవత, సీఆర్పీ నారదాసు ఉమాదేవి మాట్లాడారు. ప్రీ స్కూల్ పిల్లలకు పాఠ్యాంశాల సారాంశం అర్థమయ్యే విధంగా ఎలా బోధించాలో ఉపాధ్యాయులకు వివరించామని చెప్పారు. పిల్లల మేథో వికాసానికి, శారీరక, భాషాభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల అంగన్వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీ అందజేస్తున్న కిరణ్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గు గ్రామానికి చెందిన పొన్న నర్సవ్వకు మంజూరైన రూ.2 లక్షల 50 వేల ఎల్‌ఓసీని కాంగ్రెస్ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ శనివారం అందజేశారు. వెన్నుపూస సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నర్సవ్వ పరిస్థితిని తెలుసుకున్న కిరణ్‌కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి తీసుకు వెళ్లి ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బాల్‌రెడ్డి, నాయకులు ప్రసాద్, విజయ్, నాజర్, శివకుమార్, ముత్తయ్య, పరమేశ్వర్, భిక్షపతి, మోహన్, వెంకటేశం, ఉదయ్, బాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

19న బైక్ ర్యాలీ


కరపత్రాల ఆవిష్కరిస్తున్న సత్యం తదితరులు

సిద్దిపేటజోన్: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో 19న బైక్ ర్యాలీ ఉంటుందని హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు సత్యం తెలిపారు. శనివారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో శివాజీ చౌక్ వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాలీ అనంతరం శివాజీ చౌక్ వద్ద నిర్వహించే బహిరంగ సభలో భువనేశ్వరి పీఠా ధిపతి కమలానంద భారతి, ప్రతినిధులు అప్పాల ప్రసాద్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

పలుచోట్ల డ్రైనేజీలు నిండి మురుగు రోడ్లపై పారుతోంది. వీధుల్లో నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రోజులు గడుస్తున్నా పట్టించుకొనే నాథుడులేదని స్థానికులు ముక్కుమూసుకునే జీవిస్తున్నారు.

- డ్రైనేజీలు నిండి రోడ్లపైకి మురుగు
- దుర్గంధం వెదజల్లుతున్న రోడ్లు
- రోగాల బారినపడుతున్న ప్రజలు
- పట్టించుకొనే నాథుడు లేడని అసహనం


ఎయిర్‌టెల్ గల్లీలో యూజీడీ నుంచి పైకి వస్తున్న మురుగునీరు


దుబ్బాక డబుల్ బెడ్రూం కాలనీలో..

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని 14వ వార్డులో నాలుగు రోజులుగా యూజీడీ(అండర్ గ్రౌండ్ డ్రైనేజీ)కి సంబంధించిన మెయిన్‌లైన్ నిండిపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే నిలిచిపోతోంది. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా సంబంధించిన యంత్రాంగం లేదంటూ కాలయాపన చేస్తున్నారని స్థానిక ఎయిర్‌టెల్ గల్లీ వాసులు మండిపడుతున్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రూ.155 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ నిత్యం ఏదో ఒక వార్డులో డ్రైనేజీ సమస్య తలెత్తుతోందని వాపోయారు. మురుగు నీటితో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రోగాలతో చస్తున్నాం..

దుబ్బాక: నెలల తరబడి డ్రైనేజీలు శుభ్రం చేయకపోతుండడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో డబుల్‌బెడ్రూం కాలనీల ప్రజలు భరించలేని దుర్గంధం మధ్యన నరకయాతన పడుతున్నారు. మురుగునీరంతా రోడ్లుపై నిలిచిపోవడంతో ఇండ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని బల్వంతాపూర్ రోడ్డులో నిర్మించిన డబుల్ బెడ్రూం కాలనీల్లో సుమారుగా 840కు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీల్లో చాలా బ్లాక్‌ల్లో మురుగు కాలువలు కంపు కొడుతుండడంతో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో రోగాల బారిన పడుతున్నామంటూ ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీలు శుభ్రం చేయించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

నీళ్ల తొట్టెను కడిగేశారు

- పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలి
- నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు
- ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్

సాక్షి ఎఫెక్ట్..

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని బొడిగెపల్లి గ్రామంలో నాచుతో నిండిన నీళ్ల తొట్టెను శుభ్రం చేయించారు. బొడిగెపల్లిలో 'పడకేసిన పారిశుద్యం'.. రోడ్డు పక్కనే చెత్త చెదారం డంపు.. నీళ్ల తొట్టెలో పెరిగిన నాచు అనే శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి ఎంపీడీఓ భానోతు జయరాం, ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్ స్పందించారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తతోపాటు రోడ్డు పక్కనే డంపు చేసిన చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. అనంతరం ఎంపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక దృష్టిసారించాలని జూమ్ మీటింగ్ ద్వారా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. అలాగే ఉదయం 9గంటలకే కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, యాప్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


నీళ్ల తొట్టెను శుభ్రం చేయిస్తున్న ఎంపీఓ

'స్థానిక సంస్థ'లకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

- అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల్లోకి..
- నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేటరూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసేలా చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని బుస్సాపూర్‌లో జరుగుతున్న బీరప్ప ఆలయ అభివృద్ధి, గౌడ సంఘం ప్రహరీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైన సంవత్సరంలోనే మండల అభివృద్ధికి రూ.3కోట్లకుపైగా నిధులు వెచ్చించామన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తారని చెప్పారు. పార్టీకి ఓటు బ్యాంకు పెరిగిందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థుల విజయ శంఖారావం మోగనుందన్నారు. ప్రతీ గ్రామానికి, మండలానికి ఒక్కరు చొప్పున ఇన్‌చార్జిలను నియమించి ప్రజలకు మరింత చేరువవుతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సదాశివారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిరెడ్డి, ముద్దంలక్ష్మి, బుచ్చిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మందపాండు, నాయకులు యాదయ్య, కిషన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు సరికాదు

రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు


నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రెడ్డి సామాజిక వర్గంపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు సరికాదని, వెంటనే ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని సిద్దిపేట రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షుడు వంగ తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వ్యక్తిగతమైన ప్రతిష్ట కోసం, తన పరపతి పెంచుకోవడం కోసం తీన్మార్ మల్లన్న తమ సామాజిక వర్గాన్ని హేళన చేయడం దారుణం అన్నారు. వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నాగరాజురెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, సుమన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పద్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్య రక్షణతో అధిక దిగుబడులు


వరి పొలాన్ని పరిశీలిస్తున్న శ్రీనాథ్

మండల ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించడం వల్ల వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఏఓ బి.శ్రీనాథ్ సూచించారు. మండల పరిధిలోని పొన్నాలలో రైతు కృష్ణారెడ్డి వరి సాగును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు, సుడి దోమతోపాటు తెగుళ్ల తీవ్రనష్టాన్ని కలిగిస్తాయన్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి యాసంగి వరి పంటలో చిరుపొట్ట దశలో అగ్గి తెగులు సోకే అవకాశం ఉందని చెప్పారు. అగ్గి తెగులు నివారణ కోసం కిలో విత్తనానికి 3 గ్రా. కార్బండిజం కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలని, ట్రైసైక్లోజోల్ 75శాతం మందును 120గ్రా. లేదా టేబుకొనజోల్, ట్రిప్లాక్సిస్ట్రాబిన్ 90గ్రా. 150 లీటర్ల నీటిలో కలిపి పైరుపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. మూడు పంటలకు ఒకసారి 20కిలోల జింక్ సల్ఫేట్‌ను ఆఖరి దుక్కిలో చల్లుకోవడం వల్ల జింక్ లోపం నివారించుకోవచ్చని చెప్పారు. దీనితో పాటు వర్షాకాలం ప్రారంభంలో పచ్చిరొట్ట పైర్ల సాగు, పశువుల పేడను విరివిగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ మీరాబాయి, రైతులు పాల్గొన్నారు.

ఢిల్లీలో గెలుపుపై బీజేపీ సంబరాలు

దేశ రాజధాని ఢిల్లీ శాసనసభ ఎన్నికల ఫలితాలలో బీజేపీ గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు జిల్లా వ్యాప్తంగా శనివారం సంబురాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

జిల్లా వ్యాప్తంగా నాయకుల సంబురాలు


దుబ్బాకలో బీజేపీ నాయకుల సంబురాలు

దుబ్బాక/హుస్నాబాద్/గజ్వేల్‌రూరల్/దుబ్బాక టౌన్/తొగుట(దుబ్బాక)/కొండపాక(గజ్వేల్): దుబ్బాకలో బీజేపీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేష్‌గౌడ్ మాట్లాడుతూ ఢిల్లీ తరహాలోనే తెలంగాణలో సైతం బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీకాంత్‌యాదవ్, సుభాష్‌రెడ్డి, మల్లారెడ్డి, భాస్కర్, రమణారెడ్డి, నేహాల్‌గౌడ్, భద్రి, యాదగిరి, సాయికుమార్‌గౌడ్, కిషన్, మహేశ్ బాచి, మనోజ్‌గౌడ్, శ్రీనివాస్, యాదవరెడ్డి తదితరులు ఉన్నారు. హుస్నాబాద్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లక్కిరెడ్డి తిరుమల, నాయకులు శంకర్ బాబు, వేణుగోపాల్‌రావు, నరేశ్, స్వరూప, వీరాచారి, సంపత్ నాయక్, మహేందర్ రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గజ్వేల్ అంబేడ్కర్ చౌరస్తాలో పట్టణశాఖ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, రాష్ట్ర నాయకుడు ధరం గురువారెడ్డి మాట్లాడారు. జశ్వంత్‌రెడ్డి, సురేశ్, అరవింద్, సందీప్, నాగు ముదిరాజ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. రాయపోల్‌లో మండల అధ్యక్షుడు మంకిడి స్వామి, భాస్కర్ రెడ్డి, స్వామి, మధుసూదన్ రెడ్డి, సంతోష్ రెడ్డి, నరేశ్ గౌడ్, లక్ష్మణ్, నర్సింహులు, సుఖేందర్ రెడ్డి తదితరులు సంబురాలు జరిపారు. తొగుట అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రం, నర్సిహులు, శ్రీకాంత్‌రెడ్డి, స్వామిరెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు. కుకునూర్‌పల్లి బస్టాండ్ వద్ద ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం: ఎంఈఓ


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ తదితరులు

దుబ్బాకటౌన్: రాయపోల్ మండలం వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యాసాగర్, వేణు అందించిన సేవలు మరువలేనివని, బదిలీలు సర్వసాధారణమేనని రాయపోల్ మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఆ ఉపాధ్యాయులను శనివారం స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యాసాగర్ 12 సంవత్సరాలు, వేణు 14 సంవత్సరాలు విధులు నిర్వహించి ఎంతో మంది విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం అంజిరెడ్డి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు రజని, వరప్రసాద్, సుధాకర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రికెట్ టోర్నీ ప్రారంభం


వివరాలను వెల్లడిస్తున్న నిర్వాహకులు

సిద్దిపేటఅర్బన్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండల నాయకులు, కేసీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో ఆదివారం నుంచి 17వ తేదీ వరకు మండల స్థాయి కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎద్దు యాదగిరి, పయ్యావుల శ్యామ్, చింతల శ్రీనివాస్ తెలిపారు. శనివారం మిట్టపల్లిలో వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 12 గ్రామాల నుంచి 30 టీమ్‌లు పాల్గొంటాయని, కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరుకానున్నట్లు తెలిపారు. విన్నర్ టీమ్‌కు రూ.లక్ష, రన్నరప్ టీమ్‌కు రూ.50 వేలు అందజేయనున్నట్లు చెప్పారు. నాయకులు రాము, సంతోష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


శ్రీనివాస్(ఫైల్)

సిద్దిపేటజోన్: గత నెల 29న మాఘ అమావాస్య పుణ్య స్నానాలకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన శ్రీనివాస్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్ మండలం కట్నాపల్లి వద్ద కల్వర్టు కారు ఢీ కొట్టిన ఘటనలో అక్కడికక్కడే దంపతులు చనిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో గాయపడిన శ్రీనివాస్ పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

వివిధ పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు శనివారం ఉత్సాహంగా జరుపుకున్నారు. అందులో భాగంగా ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధించారు. ఉత్తమ విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు.


మిరుదొడ్డి(దుబ్బాక): అందె పాఠశాలలో..


నంగునూరు(సిద్దిపేట): పాలమాకుల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


కోహెడరూరల్(హుస్నాబాద్): గుండారెడ్డిపల్లి పాఠశాలలో

సంక్షిప్త వార్తలు

◆ కిమ్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

సిద్దిపేటజోన్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 26వ వార్డు కౌన్సిలర్ ప్రవీణ్ సూచించారు. శనివారం కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మహా కుంజర యాత్ర పేరిట రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్టు క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ క్యాంపు ఇన్‌చార్జి విమలాకర్ రెడ్డి తెలిపారు.

◆ అనాథ పిల్లలకు జన్మదిన వేడుకలు

హుస్నాబాద్: స్థానిక ఆర్యవైశ్య భవనంలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో మహిళల మహాసభ వికాస అనాథ పిల్లలకు శనివారం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ సమాజంలో తల్లిదండ్రులు లేని పిల్లలకు అన్ని తానై సహాయ సహకారాలు అందిస్తున్న బాల వికాస వ్యవస్థాపకురాలు బాలక్క సమాజానికి ఎంతో ఆదర్శమన్నారు. కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు బాలకిష్టయ్య, బాల వికాస మేనేజర్ లత, వివిధ పార్టీల నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, అయిలేని అనిత, చిత్తారి పద్మ, వెన్న రాజు, మహేందర్ తదితరులు ఉన్నారు.

◆ విలేకరిపై కేసు నమోదు

జగదేవ్‌పూర్(గజ్వేల్): తప్పుడు వార్తలు రాస్తూ, డబ్బులు డిమాండ్ చేస్తున్న ఓ విలేకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని ఇటిక్యాల గ్రామంలో దళిత రైతులు తమ భూముల్లో రాళ్లను జేసీబీ సహాయంతో తొలగిస్తున్నారు. మండలానికి చెందిన ఓ దినపత్రిక విలేకరి గ్రామానికి వెళ్లి భూమిని చదును చేస్తున్న ఫొటోలు తీసుకుని అక్రమంగా మట్టిని కొడుతున్నారని, అలాగే ఆలయ భూమికి సంబంధించిన భూమిలో మట్టి దందా చేస్తున్నారని జేసీబీ నిర్వాహకులకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశారని తెలిపారు. డబ్బులు ఇవ్వకపోవడంతో తప్పుడు వార్తలు రాయడంతో గ్రామానికి చెందిన దళిత రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ గీత సంఘం అధ్యక్షుడి ఎంపిక

సిద్దిపేటజోన్: సిద్దిపేట గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా లాల్ బహదూర్ గౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా మార్క శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శిగా పల్లె బాల్ కిషన్ గౌడ్, కోశాధికారిగా కిష్టయ్య గౌడ్ డైరెక్టర్లుగా సత్యం గౌడ్, సునీల్ గౌడ్, ప్రకాశ్‌గౌడ్ బుచ్చవ్వ, జ్యోతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీతా కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతామన్నారు.

◆ భక్తుల కోసం బోరు మోటరు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి రాజేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు తాగునీరు కష్టాలు ఉండకుండా శనివారం బోరు మోటరు అమర్చారు. 25 నుంచి శివరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఈఓ కిషన్‌రావు తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు అనిల్‌కుమార్, రవీందర్‌రెడ్డి, వెంకటస్వామి ఉన్నారు.

◆ రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

చిన్నకోడూర్(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల ఫ్లెక్సీలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ ఆధ్వర్యంలో చిన్నకోడూర్‌లో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 30 యేళ్లుగా పోరాటం చేస్తున్న మాదిగల కల సాకారం చేసిన ఘనత పార్టీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పరశురాములు, రాజు, రాజేశ్, ప్రశాంత్, రాజు, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ వర్గీకరణ పేరుతో ప్రభుత్వాల చిచ్చు

మిరుదొడ్డి(దుబ్బాక): వర్గీకరణ పేరుతో మాల మాదిగల మధ్య కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిచ్చుపెడుతున్నాయని జాతీయ మాల మహానాడు నాయకులు మండిపడ్డారు. శనివారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ ఒక వర్గాన్ని ఓటు బ్యాంకుగా మల్చుకోవడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ పేరుతో మాలలకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. రాజేశ్, రోశయ్య, ధార స్వామి, అంజయ్య, సుదర్శన్, రాజం, చంద్రం, నర్సింహులు, రాములు, యాదయ్య పాల్గొన్నారు.

◆ దుకాణాలలో తనిఖీలు

గజ్వేల్‌రూరల్: దుకాణాదారులు, ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు వ్యాపార, వాణిజ్య సంస్థలలో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులను వాడాలన్నారు. అనంతరం రోడ్ స్వీపింగ్, డ్రైనేజ్ క్లీనింగ్ పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.